క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు పెంచాలి

• డీఈఓ మాణిక్యంనాయుడు



విద్యార్థుల స్థాయిని పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

డెంకాడ: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు నిత్యం పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్ల వలస పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా 1,2,3 తరగతుల విద్యార్థులతో కాసేపు మాట్లాడి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. అలాగే హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం 4,5,6,7 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి



సర్వే పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్వేకు సహకరించాలని కమిషనర్ కె. అప్పలరాజు కోరారు. శుక్రవారం ఆయన నగర పంచాయతీలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, చర్చి, మసీదులు, దేవాలయాలు తప్ప అన్ని వ్యాపారాలు చిన్న, మధ్య, పెద్ద కమర్షియల్ ట్రేడుల న్నింటి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తారని తెలిపారు. అలాగే సర్వే వల్ల ఆయా వ్యాపార సంస్థలకు శిక్షణ, ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని, వ్యాపార సంస్థల యజమానులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పరిశోధనా సంస్కృతి పెంపొందించాలి

• ఏఐసీటీఈ నిపుణుడు రాధా ప్రసాదరాజు



మాట్లాడుతున్న ఏఐసీటీఈ నిపుణుడు రాధా ప్రసాదరాజు

డెంకాడ: ఉన్నత విద్యలో పరిశోధనా సంస్కృతిని పెంపొందించాలని ఏఐసీటీఈ నిపుణుడు డాక్టర్ దండు రాధా ప్రసాదరాజు అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ డిస్టింగ్విస్ట్ ప్రొఫెసర్ స్కీమ్‌లో భాగంగా పరిశోధన, అభివృద్ధికి నిధులు అవకాశాలపై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యకు పరిశ్రమకు మధ్య అంతరాయాన్ని తగ్గించే చర్యలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచే మార్గాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, కో ఆర్డినేటర్ శివ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



రూ. 50వేల చెక్‌ను గాయత్రీశర్మకు అందజేస్తున్న భానురాజా దంపతులు

విజయనగరం టౌన్: నగరంలోని సిటీబస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పైడితల్లి దేవస్థానం పూర్వ ఈఓ భానురాజా కోరారు. ఈ మేరకు ఆలయం ఆవరణలో అమ్మవారిని శుక్రవారం దర్శించుకుని.. ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల చెక్ ఆలయ వ్యవస్థాపకులు వీకే గాయత్రీశర్మకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో..

• గతేడాదితో పోల్చుకుంటే బాగా తగ్గిన విస్తీర్ణం • సాగుకు ఆసక్తి చూపని అన్నదాతలు

తగ్గిన పంటల సాగు

రబీలో సాగైన వివిధ పంటల వివరాలు హెక్టార్లలో..

పంట పేరు	సాధారణం	సాగైంది
మొక్కజొన్న	21,951	16,978
చోడి	1,255	668
చెరకు	4,053	1,309
వేరుశనగ	473	174
వరి	2,639	765
టమోటా	224	74
నువ్వులు	1,245	176
ఉల్లి	24	04



జామి మండలంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్‌లో తుఫాన్లు, తెగుళ్ల కారణంగా రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. పంట చేతికి వచ్చే సమయంలో రెల్ల రాల్చుపురుగు వరి పంటను ఆశించడంతో వరి కంకులు నేల రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి 25 నుంచి 30 బస్తాల (80 కేజీలు) దిగుబడి రావాల్సి ఉండగా పురుగు ఆశించడం వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఎకరానికి 13 నుంచి 15 బస్తాల మాత్రమే దిగుబడి వచ్చింది. దీన్నుంచి తేరుకునేలోగా వరుస తుఫాన్‌ల వల్ల పంట పొలాల్లో ఉన్న వరి పంట తడిచి ముద్దయింది. దీనికి తోడు పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. దాని ప్రభావం రబీ సీజన్‌పై పడింది. రబీలో పంట సాగు చేయడానికి రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఖరీఫ్‌లో అప్పులు చేసి పంటలు సాగు చేశారు. రబీలో కూడా పెట్టుబడికి అప్పులు చేయాల్సి రావడంతో రైతులు పంటల సాగుకు వెనుకాడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ప్రతి ఏటా రూ. 13,500 చొప్పున వైఎస్సార్ రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయాన్ని అందించింది. కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పేరిట రూ. 20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పినా ఇంతవరకు ఒక్కపైసా విదల్చలేదు.

గత ఏడాది కంటే తగ్గిన సాగు..

రబీలో గతేడాది కంటే ఈ ఏడాది పంటల సాగు తగ్గింది. ముఖ్యంగా మొక్కజొన్న, చెరకు, చోడి వంటి పంటల సాగు తగ్గింది. గతేడాది 18, 861 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగవ్వగా.. ఈఏడాది 16,976 హెక్టార్లలో.. చోడి (రాగి) పంట గతేడాది 1039 హెక్టార్లలో సాగవ్వగా.. ఈ ఏడాది 668 హెక్టార్లలో సాగైంది. అదేవిధంగా చెరకు పంట గతేడాది 2,177 హెక్టార్లలో సాగువ్వగా ఈ ఏడాది 1309 హెక్టార్లలో.. వేరుశనగ పంట గతేడాది 286 హెక్టార్లలో సాగవ్వగా ఈ ఏడాది 174 హెక్టార్లలో సాగైంది.

చెరకు పంటకు గడ్డు పరిస్థితి..

జిల్లాలో చెరకు పంటకు గడ్డు పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు జిల్లాలో చెరకు పంట 20 నుంచి 30 వేల హెక్టార్ల వరకు సాగయ్యేది. క్రమేణా సాగు విస్తీర్ణం తగ్గింది. చెరకు పంటకు మద్దతు ధర లభించకపోవడంతో పాటు చెరకు ఫ్యాక్టరీలు మూత పడడం వల్ల చెరుకు పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. కూటమి నాయకులు భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల సమయంలో హామీలిచ్చారు. కాని ఇంతవరకు ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. జిల్లాలో సాగు చేసిన చెరకు పంటను పాలకొండ దగ్గర ఉన్న సంకలి ఫ్యాక్టరీకి తరలించాల్సిన పరిస్థితి. అంతదూరం దిగుబడులు తీసుకెళ్లలేక సాగు తగ్గించేశారు. వేరుశనగ పంట కూడా ఒకప్పుడు అధికంగానే సాగయ్యేది. ప్రస్తుతం ఆ పంట విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గింది.



రేగిడి ఆముదాలవలస మండలంలో సాగులో ఉన్న వేరుశనగ

పెరిగే అవకాశం ఉంది..

మొక్కజొన్న, వేరుశనగ, చోడి, చెరకు పంటల విస్తీర్ణం నెలఖారు నాటికి పెరిగే అవకాశం ఉంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

వి. తారకరామరావు, జిల్లా వ్యవసాయ అధికారి

సంజీవయ్యది అత్యున్నత వ్యక్తిత్వం



విజయనగరం ఫోర్ట్: సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న జేసీ సేతు మాధవన్



విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, సిబ్బంది

• జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని జాయింట్ కలెక్టర్ ఎస్. సేతుమాధవన్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మాజీముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మికశాఖ, విద్యాశాఖల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ డీడీ బి. రామనందం, తదితరులు పాల్గొన్నారు.

నేటి రాజకీయ వ్యవస్థకు అవసరం..

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆలోచన విధానం నేటి రాజకీయ వ్యవస్థకు అవసరమని ఏపీ అంబేడ్కర్ రైట్ ఫోరమ్ అధ్యక్షుడు భానుమూర్తి అన్నారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ దళిత ఐక్యవేదిక కార్యాలయంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు. ముందుగా దామోదరం సంజీవయ్య కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం భానుమూర్తి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ ముందు బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో దారాన వెంకటేష్, లోపింటి రామకృష్ణ, పల్లికల వెంకటలక్ష్మి, గంట్యాడ శివ, పూసర్ల మధుసూదనరావు, యెజ్జల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో దివంగత దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.అప్పలరాజు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రిగా దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు సంజీవయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పంచాయతీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప మానతావాది

విజయనగరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి



విజయనగరం: దామోదరం సంజీవయ్య కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీ అంబేడ్కర్ రైట్ ఫోరమ్ ప్రతినిధులు



నెల్లిమర్ల: సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

దివంగత దామోదరం సంజీవయ్య గొప్ప మానవతావాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కొనియాడారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సామాన్య జీవితాన్ని అనుభవించి అసామాన్య పదవులను అలంకరించిన మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్ కోటాను ఆయన పెంచారని.. అందుకే ఆయన బోనస్ సంజీవయ్యగా ఖ్యాతి గాంచారన్నారు. ఒప్పంద కార్మికుల చట్టం, బాలకార్మిక చట్టం, రవాణా వాహన కార్మికుల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాలు చట్టాలను అమల్లోకి తీసుకువచ్చిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు..

విజయనగరం గంటస్తంభం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత దామోదరం సంజీవయ్య నేటి రాజకీయాలకు దార్శనికుడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితజాతి కీర్తిని ఢిల్లీ వరకు విస్తరింప జేసిన మహనీయుడని కొనియాడారు.

తపాలా సేవలను విస్తృతం చేయాలి



శిక్షణార్థులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ ట్రైనీ జగన్నాథం, కిశోర్ పట్నాయక్, తదితరులు

విజయనగరం టౌన్: తపాలాశాఖ సేవలను తమ పరిధిలో మరింత విస్తృతం చేయాలని హెడ్ పోస్ట్ మాస్టర్ డీవీ రామశాస్త్రి అన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ స్వీయ పర్యవేక్షణలో జిల్లా తపాలాశాఖ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎంపికైన బీపీఎం ఉద్యోగులకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణార్థులు తమ శిక్షణా కాలంలో తపాలాశాఖకు చెందిన ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని, వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ పీవీ జగన్నాథం, పోస్టల్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ కిషోర్ పట్నాయక్, ఉద్యోగులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ తగదు

విజయనగరం టౌన్: తపాలాశాఖ ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని తపాలాశాఖ ఎన్ఎఫ్‌పీఈ నాయకులు వి. శ్రీనివాస్, జి.గణేశ్వరరావు అన్నారు. తపాలా ఉద్యోగుల కేంద్ర సంఘాల పిలుపు మేరకు హెడ్‌పోస్టాఫీస్‌లో ఉద్యోగులు శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023 పోస్టాఫీస్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని, పాత పెన్షన్ అమలు, జీడీఎస్‌లను కూడా ఎనిమిదో వేతన సంఘంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.శ్రీనివాస్, పి.సూరిబాబు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తపాలాశాఖ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ సంఘాల ప్రతినిధులు

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

• సత్య డిగ్రీ, పీజీ కళాశాల సంచాలకుడు శశిభూషణరావు



మాట్లాడుతున్న సత్య డిగ్రీ, పీజీ కళాశాల సంచాలకుడు శశిభూషణరావు

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సత్య డిగ్రీ, పీజీ కళాశాల సంచాలకుడు మజ్జి శశిభూషణరావు ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో యోకోహోమ టైర్స్, పేటీఎం, రక్షిత్ గ్రూపు ఆఫ్ ఫార్మా కంపెనీలతో పూల్ క్యాంపస్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 83 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్, వీరేంద్ర, వేంకటేశ్వరరావు, రామునాయుడు, విజయ్, కుమారి, మీనాక్షి, తరుణ్, ఆర్. శ్రావణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు కోటి, ఎం. ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత పనులు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు చురుగ్గా చేపడుతున్నారు. తీసిన పూడికలను వెంటనే డంపర్ బిన్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది పనులు చేపడుతున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి..

నెల్లిమర్ల: అర్హులైన నగర పంచాయతీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు, సీపీఐ నాయకుడు ఎం. పాపారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నగర పంచాయతీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల నుంచి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం నగర పంచాయతీలో 1400 మంది పేదలను గుర్తించి కొండ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ, ఇంతవరకు స్థలాలు చూపించలేదని చెప్పారు. అనంతరం డీటీ రవిశంకర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకుడు కె. అప్పలసూరి, కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం, ఎ.లత, సీహెచ్ ఆదిలక్ష్మి, లెంక రమణమ్మ, జమ్ము కృష్ణమ్మ, డి.గౌరి, తదితరులు పాల్గొన్నారు.



డీటీ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, పేదలు

సమస్యలు పరిష్కరించండి..

• నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: ప్రజా సమస్యలు తెలుసుకుని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని 22వ డివిజన్ పేర్లవారి జంక్షన్ నుంచి చిన్నవీధి, బొడ్డువారి జంక్షన్, ఉసిరికుల సత్రం, తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాణిజ్య పరంగా రద్దీగా ఉండే డివిజన్ కావడంతో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను వెనువెంటనే తొలగించాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు లేకుండా చూడాలన్నారు. నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ విషయంలో ప్రజా సహకారం కూడా ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



22వ డివిజన్‌లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య